అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక
RNI NO: APBIL/2011/37440
Post Regd No. GTR/90/2025-27

బాపట్ల చరిత్రలో ఎన్నడూ చూడని ఎన్నికల విధ్వంసం!

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు.. ఇండిపెండెంట్ ప్యానల్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా నిర్బంధాలు

జర్నలిస్టుపై దాడి.. అర్బన్ బ్యాంక్ చైర్మన్‌పై ఎమ్మెల్యే దౌర్జన్యం.. నన్ను గంటల తరబడి నిర్బంధించారు

ప్రాణం పోయినా బాపట్ల ఆత్మగౌరవ పోరాటం ఆపను..

డిసెంబర్ 3 నుంచి కార్యాచరణ నిరంతరం ప్రజల మధ్యే ఉంటా: అన్నం సతీష్ ప్రభాకర్



బాపట్ల(అక్షర భూమి)**27.11.26** బాపట్ల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చగా మిగిలిపోతాయని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఒక ఇండిపెండెంట్ ప్యానల్‌ను అడ్డుకోవడానికి అధికార బలం, పోలీసు వ్యవస్థను ఉపయోగించుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. గత పది రోజులుగా జరిగిన ప్రతి పరిణామానికి పత్రికా ప్రతినిధులు ప్రత్యక్ష సాక్షులని, తమ ఆలోచనలు, విధానాలు, బాపట్ల ఆత్మగౌరవ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియా ప్రతినిధులందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

బాపట్ల ప్రశాంతతను దెబ్బతీశారు

బాపట్ల అంటే ప్రశాంతతకు, సోదరభావానికి మారుపేరని, రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రజలంతా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించే ప్రాంతమని అన్నం సతీష్ పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం పదవీ విరమణ తర్వాత బాపట్లలో నివసించేందుకు అసక్తి చూపుతారని తెలిపారు. అలాంటి ప్రశాంతమైన ప్రాంతంలో బయటి రాష్ట్రాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి రౌడీయిజం, గుండాయిజంతో భయానక వాతావరణం సృష్టించడం దుర్మార్గమన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు కేవలం ఒక మున్సిపల్ చైర్మన్ పదవి కోసం ఇంతటి దారుణాలకు పాల్పడతారని ఊహించలేదన్నారు. 25 ఏళ్ల పాటు చంద్రబాబు నాయుడు వద్ద పనిచేసిన వ్యక్తిగా, టీడీపీ, బీజేపీ రాజకీయ విధానాలపై అవగాహన ఉన్న వ్యక్తిగా ఈ స్థాయి అధికార దుర్వినియోగాన్ని ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు.

పక్క రాష్ట్రాల వ్యక్తులతో జర్నలిస్టుపై దాడి

పోలింగ్ సందర్భంగా రాయలసీమ, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు స్థానిక ప్రజలను భయపెట్టడమే కాకుండా, వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టుపై కూడా దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా ప్రతినిధులకే రక్షణ లేకుండా పోవడం ఎంతటి దురదృష్టకరమని ప్రశ్నించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసే జర్నలిస్టులపై దాడులు చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనన్నారు.

అర్బన్ బ్యాంక్ చైర్మన్‌పై ఎమ్మెల్యే దౌర్జన్యం

బాపట్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రవి పోలింగ్ కేంద్రం వద్ద ప్రశ్నించేందుకు వెళ్లగా, స్వయంగా ఎమ్మెల్యే అయన మెడ పట్టుకొని బయటకు నెట్టివేశారని అన్నం సతీష్ ఆరోపించారు. ప్రజాప్రతినిధిగా ఉండాల్సిన వ్యక్తి ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తితో ఇలా వ్యవహరించడం ఏ విధమైన ప్రజాస్వామ్యమని నిలదీశారు. ఎమ్మెల్యే, ఎంపీలు అనుచరులతో కలిసి నేరుగా పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఓటర్లను, అధికారులను భయభ్రాంతులకు గురిచేయడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమన్నారు.

నన్ను ఉగ్రవాదిలా చుట్టుముట్టి నిర్బంధించారు

తాను ఒక అభ్యర్థికి ఎన్నికల ఏజెంట్‌గా ఉన్నప్పటికీ ఏ ఒక్క పోలింగ్ బూత్‌లోకి వెళ్లలేదని, తన వాహనానికి అనుమతి ఉండటంతో 44 వార్డుల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వెళ్లానని తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఐదు పోలీసు వాహనాల్లో వచ్చిన సీఐలు, ఎస్ఐలు, పెద్ద సంఖ్యలో పోలీసులు తనను చుట్టుముట్టి సెల్‌ఫోన్ లాక్కొని నిర్బంధించారని వివరించారు.

తాను ఏ తప్పు చేశానో, తనపై ఏ కేసు ఉందో చెప్పకుండా పోలీసు వాహనంలో ఎక్కించి దాదాపు గంటపాటు అటు ఇటు తిప్పారని తెలిపారు. అనంతరం తాను ఐస చేస్తున్న అపార్ట్‌మెంట్‌కు తీసుకెళ్లి రాత్రి 9.30 గంటల వరకు పోలీసుల పర్యవేక్షణలోనే ఉంచారని చెప్పారు. తన న్యాయవాది వచ్చినా మాట్లాడేందుకు అనుమతించలేదని, ఎందుకు నిర్బంధించారో అడిగినా సమాధానం చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని పోలీసులు చెప్పారన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపించమన్న పాపానికి ఇదేనా బహుమానం?

గతంలో తానే ప్రస్తుత ఎమ్మెల్యేకు మద్దతుగా ప్రజల్లో ప్రచారం చేశానని, అయన నిజాయితీపరుడని, బాపట్ల ప్రజలకు మంచి చేస్తారని నమ్మి ఓటు వేయాలని కోరానని తెలిపారు. కానీ ఇప్పుడు తనకు దక్కిన బహుమానం నిర్బంధం, అవమానమని ఆవేదన వ్యక్తం చేశారు.

అయనను గెలిపించమని ప్రజలను కోరినందుకు తన తప్పుకు తానే చెంపలేసుకుంటున్నానని, అందుకు ప్రాయశ్చిత్తం కూడా చేసుకుంటానని వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా తనకు ఎదురైన అవమానం కంటే ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన నష్టమే తనను ఎక్కువగా బాధిస్తోందన్నారు.

32 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదు

1994 నుంచి స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలను ప్రత్యక్షంగా గమనిస్తున్నానని, 32 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఒక ఇండిపెండెంట్ ప్యానల్‌ను అడ్డుకోవడానికి ఈ స్థాయిలో నిర్బంధాలు, పోలీసుల మోహరింపు ఎప్పుడూ చూడలేదని అన్నారు. సాధారణంగా అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తుందని, కానీ బాపట్లలో ఒక ఇండిపెండెంట్ ప్యానల్‌ను లక్ష్యంగా చేసుకొని నిర్బంధించడం ఆశ్చర్యకరమన్నారు.

ప్రతిపక్ష నాయకులు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాల వద్ద తిరుగుతుంటే, తనను మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి వరకు నిర్బంధించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. బాపట్లలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ అవగాహన ఉందని, ప్రజల పక్షాన నిలబడాల్సిన నిజమైన ప్రతిపక్షం ఇండిపెండెంట్ ప్యానలేనని వ్యాఖ్యానించారు.

వ్యాపార వర్గాలపై ఒత్తిళ్లు

కిరాణా వ్యాపారులు, రేషన్ డీలర్లు, రైస్ మిల్లర్లు, క్షాత్ మర్చెంట్లు తదితర వ్యాపార వర్గాలను ఫోన్ల ద్వారా బెదిరించి, భయపెట్టారని ఆరోపించారు. ఎవరు ఏ వ్యాపారం చేసుకోవాలన్నా రాజకీయ నాయకుల అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి తీసుకొస్తున్నారా అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదని, ఐదేళ్ల పదవీకాలం ప్రజలకు సేవ చేసేందుకు మాత్రమేనని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

నవంబర్ 26న రాజ్యాంగానికి తీరని అవమానం

భారత రాజ్యాంగం అమోదం పొందిన నవంబర్ 26వ తేదీనే బాపట్లలో రాజ్యాంగ విలువలను ఖూనీ చేశారని అన్నం సతీష్ అవేదన వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి భారీగా వెళ్లడం, ఓటర్లను భయపెట్టడం, అధికారులను ఒత్తిడికి గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛగా ఓటు వేసే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ప్రజల మనసులు గెలిచాం.. 30న ఫలితాలు చెబుతాయి

ఎన్నికల సందర్భంగా జరిగిన ఒత్తిళ్లు, నిర్బంధాల మధ్య కూడా తమ అభ్యర్థులు, ఏజెంట్లు, కార్యకర్తలు ధైర్యంగా నిలబడ్డారని తెలిపారు. బాపట్లలో సుమారు 70 శాతం పోలింగ్ నమోదైందని, మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పోలింగ్ శాతం ఒక్కసారిగా పెరగడంపై కూడా పలు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. తమ ఓట్లను తగ్గించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.తాము ఎన్ని స్థానాల్లో గెలుస్తామో, ఎన్ని ఓట్లు వస్తాయో ఇప్పుడే చెప్పబోనని, నవంబర్ 30న ఓట్ల లెక్కింపు తర్వాత బాపట్ల ప్రజల తీర్పు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తమకు మంత్రులు, ఎమ్మెల్యేలు, స్టార్ క్యాంపెయినర్లు లేకపోయినా ప్రజల అభిమానం, నమ్మకం ఉన్నాయని అన్నారు.

ప్రాణం పోయినా ఆత్మగౌరవ పోరాటం ఆపను

తాను పోరాడుతున్నది కేవలం వ్యక్తులతో కాదని, బలమైన రాజకీయ శక్తులతోనని అన్నం సతీష్ స్పష్టం చేశారు. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఒక్కసారి అడుగు ముందుకు వేసిన తర్వాత వెనుదిరిగే వ్యక్తిని కాదని, ప్రాణం పోయినా బాపట్ల ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడతానని స్పష్టం చేశారు.

డిసెంబర్ 3 నుంచి నిరంతరం ప్రజల మధ్యే..

ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా డిసెంబర్ 3వ తేదీ నుంచి తన భవిష్యత్ కార్యాచరణ ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఇకపై నిరంతరం ప్రజలతో కలిసి నడుస్తానని, బాపట్లలో ప్రతి వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటానని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల మధ్యకు వచ్చే నాయకుడిని కాదని, నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడతానన్నారు.బాపట్లలో పారిశుద్ధ్యం, తాగునీరు, దోమల సమస్య, వీధిలైట్లు, మౌలిక వసతులు సహా ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యపై తన గళం వినిపిస్తానని పేర్కొన్నారు. తమ పోరాటం పదవుల కోసం కాదని, బాపట్ల ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు పట్టణ అభివృద్ధి, ప్రజల హక్కుల పరిరక్షణ కోసమేనని అన్నం సతీష్ ప్రభాకర్ స్పష్టం చేశారు.

రెండవ దశ పంచాయతీ ఎన్నికల ప్రచారం నేటితో ముగింపు

నేడు శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రచారం నిర్వహించరాదు

సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం

ఎన్నికలు జరిగే ప్రాంతాలతో సంబంధం లేని ఇతర ప్రాంతాల వ్యక్తులు వెంటనే వెళ్లిపోవాలి

అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలి

నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం

జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్



బాపట్ల(అక్షర భూమి)**27.11.26** రెండవ దశ పంచాయతీ ఎన్నికలు జరగనున్న చీరాల, వేమూరు నియోజకవర్గాల పరిధిలోని పంచాయతీల్లో నేటి సాయంత్రం నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ హెచ్చరించారు. ఈ నెల 29వ తేదీన రెండవ దశ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో రెండవ దశ పంచాయతీ ఎన్నికలు ఈ నెల 29వ తేదీన జరగనున్నాయని తెలిపారు. మొత్తం 7 మండలాల పరిధిలో 113 పంచాయతీలు, 1,204 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, వీటిలో 17 సర్పంచ్ స్థానాలు, 393 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. మిగిలిన 96 పంచాయతీలు, 811 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 96 సర్పంచ్ స్థానాలకు 281 మంది, 811 వార్డు సభ్యుల స్థానాలకు 1964 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు.

ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థుల ఎన్నికల ప్రచారం నేటితో ముగుస్తుందని, శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రెండవ దశ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు, వారి అనుచరులు, కార్యకర్తలు ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ప్రచారం నిర్వహించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికలు జరిగే ప్రాంతాలతో సంబంధం లేని ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇప్పటివరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఉంటే, వారు తక్షణమే ఆయా ప్రాంతాల నుంచి వెళ్లిపోవాలని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు తెరవడానికి అనుమతి లేదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా స్థానిక పోలీసులకు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 83338813228 లేదా 112కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

పోలీసుల కళ్లెదుటే జర్నలిస్టుపై దాడి!

బాపట్ల(అక్షర భూమి)**27.11.26** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాపై దాడి చేయడం ప్రజాస్వామ్య విలువలపై దాడి చేయడమేనని బాపట్ల జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు తీవ్రంగా మండిపడ్డారు. ఎన్నికల కవరేజీలో భాగంగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుపై బాపట్ల ఏవీవీ పాఠశాల వద్ద తెలంగాణ, చిత్తూరు కు చెందిన కొందరు బీజేపీ నాయకులు భౌతిక దాడికి దిగడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరగడం శాంతిభద్రతల పరిస్థితిపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. విధుల్లో ఉన్న జర్నలిస్టును రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి, బాపట్ల మున్సిపాలిటీ ఎన్నికల బీజేపీ ఇన్చార్జి నాగోతు రమేష్ నాయుడు అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా భౌతిక దాడికి పాల్పడటం ఏమిటని ప్రశ్నించారు. తోటి మీడియా ప్రతినిధులంతా అడ్డుకునేందుకు ప్రయత్నించినా లెక్కచేయకుండా దాడికి దిగడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. ఎన్నికల కవరేజీ చేస్తున్న జర్నలిస్టులకే రక్షణ లేకపోతే సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటని నిలదీశారు. స్థానికేతర నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద హల్‌చల్ చేయడం, విధుల్లో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులకు దిగడం ఎన్నికల నిబంధనల అమలుపైనా ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత జర్నలిస్టు తరపున పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

ఒకరిపై దాడి కాదు.. మీడియా సమాజంపై దాడి



జర్నలిస్టులపై దాడులను చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని శ్రీనివాసరావు హెచ్చరించారు. నిందితులపై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్టు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులందరినీ సమీకరించి ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా కాకుండా యావత్ మీడియా సమాజంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు.

నల్లమోతువారిపాలెం సర్పంచ్‌గా పొన్నం యానదిమ్మ, ఉప సర్పంచ్‌గా మడా శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక

బాపట్ల(అక్షర భూమి)**27.11.26** నల్లమోతువారిపాలెం పంచాయతీ ఏకగ్రీవం – సర్పంచ్‌గా పొన్నం యానదిమ్మ...
ఉప సర్పంచ్‌గా మడా శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక.
ఏకగ్రీవానికి సహకరించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకు, గ్రామస్థులకు,అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన కూటమి నేతలు
గ్రామ పెద్దలు. ఏకగ్రీవం గ్రామ ఐక్యతకు నిదర్శనం – ఏకగ్రీవ నిర్ణయంపై హర్షం. టీడీపీ యువ నాయకులు రాకేష్ వర్మను కలిసిన నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామస్థులు.
యునేతకు ప్రశంసల జల్లు..యువనేత చొరవతోనే మండలం లో ఎన్నడూ లేని విధంగా గా ఏకగ్రీవాలు. శక్తి వంచన లేకుండా గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చిన రాకేష్ వర్మ. కార్యక్రమంలో పాల్గొన్న మండల జడ్పిటిసి నక్కల లక్ష్మి వెంకటస్వామి, ఉపాధ్యక్షులు సూరినేని రేవతి మురళి కృష్ణ.



టీడీపీ, జనసేనగ్రామ పార్టీ అధ్యక్షులు మునిపల్లి చిన్న,గరిగంటి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు.

ఉదయగిరిలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా కాకర్ల సురేశ్ ప్రచారం

ఉదయగిరి, నవంబర్ 27 : స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉదయగిరి పట్టణంలో కూటమి బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా కాకర్ల సురేశ్ ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి సర్పంచ్ అభ్యర్థి షేక్ రియాజ్‌తో పాటు వార్డు సభ్యుల అభ్యర్థుల తరపున ప్రజలను కలిశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల గురించి వివరిస్తూ, వారికి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు.ఉదయగిరి పట్టణంలో స్థానిక ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించినట్లు కాకర్ల సురేశ్ తన ప్రకటనలో వెల్లడించారు. కూటమి తరపున బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి షేక్ రియాజ్‌తో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు కూడా మద్దతు ప్రకటిస్తూ, వారి ఎన్నికల గుర్తులను ప్రజలకు వివరించారు. స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరినట్లు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలను కాకర్ల సురేశ్ ప్రస్తావించారు. గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి స్థానిక సంస్థల పాత్ర కీలకమని పేర్కొంటూ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని తన ప్రచారంలో వివరించారు.ఉదయగిరి పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా



మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామాల అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో స్థానిక సంస్థల ఎన్నికలు ముఖ్యమైనవని పేర్కొంటూ తన అభిప్రాయాలను ప్రజల ముందు ఉంచారు. స్థానిక పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా షేక్ రియాజ్‌తో పాటు వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన కాకర్ల సురేశ్.. ఓటర్లను కలిసి అభ్యర్థుల ఎన్నికల గుర్తులను వివరించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారం అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ తన ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు.

సేవే లక్ష్యం.. ప్రజల ఆరోగ్యమే ధ్యేయం!

14వ వార్డు ప్రజలకు అండగా కౌన్సిలర్ భూక్యా ఉదయ్ జ్యోతి

అశ్వారావుపేట, నవంబర్ 27 (అక్షరభూమి): మారిశెట్టి. సుభాష్ అశ్వారావుపేట పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ భూక్యా ఉదయ్ జ్యోతి ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తున్నారు. వెన్నెల హాస్పిటల్ స్థాపకురాలిగా, ప్రజాప్రతినిధిగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.వెన్నెల హాస్పిటల్‌కు వైద్యం కోసం వచ్చే పేద ప్రజల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని, డబ్బులు లేని కారణంగా ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తూ ఎంతోమందికి ఆరోగ్యాన్ని అందిస్తున్నారు. అవసరమైన వారికి ఆర్థిక స్థోమతను బట్టి సహకరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.గతంలో అశ్వారావుపేట ప్రాంతంలో వరదలు సంభవించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో బాధితులకు అండగా నిలిచారు. పులిహోర పొట్లాలు, బిస్కెట్లు తదితర ఆహార పదార్థాలను పంపిణీ చేసి ఆకలితో ఇబ్బంది పడుతున్న వారికి సహాయం అందించారు.14వ వార్డులో ఎక్కడ సమస్య ఎదురైనా ముందుగా స్పందిస్తూ "నేనున్నాను.. మీకు అండగా ఉంటాను" అంటూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. టీఆర్ఎస్ పార్టీ తరఫున కూడా ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తన వంతు కృషి చేస్తున్నారు.మాధవ సేవే మానవ సేవ అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్న భూక్యా ఉదయ్ జ్యోతి సేవలను స్థానికులు అభినందిస్తున్నారు. అన్ని వార్డులోను కూడా సహకరిస్తూ ఉంటుంది



ఈవీఎం భద్రతా గిడ్డంగిని పరిశీలించిన కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పార్వతీపురం, నవంబర్ 27 : పార్వతీపురం మన్యం జిల్లాలోని ఈవీఎం భద్రతా గిడ్డంగిని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి పరిశీలించారు. గిడ్డంగి వద్ద కొనసాగుతున్న భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో నిరంతర నిఘా ఉండాలని కలెక్టర్ సూచించినట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం వెల్లడించింది. పరిశీలనలో భాగంగా గిడ్డంగికి వేసిన సీల్‌ల పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. భద్రతా గిడ్డంగి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను కూడా తనిఖీ చేశారు. కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిడ్డంగి భద్రతకు సంబంధించిన అంశాలను అయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అలాగే గిడ్డంగి వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును కలెక్టర్ సమీక్షించారు. భద్రతా విధుల్లో ఉన్న పోలీసుల ఏర్పాట్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. గిడ్డంగి పరిసరాల్లో నిఘా, పోలీసు పర్యవేక్షణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రపరిచిన ప్రాంతం వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి గిడ్డంగి సీల్‌లు, సీసీ కెమెరాల నిఘా, పోలీసు బందోబస్తు వంటి అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించడం ద్వారా భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు.